https://vijayamdaily.com
విజయం
• అక్షర సమరానికి నాంది..
ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం
ఆదివారం / ఏప్రిల్16 / 2023
https://vijayamdaily.com


## గోళ్లపాడు ఛానెల్ ఆధునీకరణతో
# త్రీ టౌన్‌కు మహర్దశ..

- నా పుట్టినరోజున ఒక మంచి పని చేయలని తలచి ఐదేళ్ల క్రితం గోళ్ళపాడు మురుగును తొలగించే పని ప్రారంభం.
- రజబ్ అలీ పార్క్, వీధి వ్యాపారుల సముదాయం ప్రారంభం..
- మంత్రి పువ్వాడ అజయ్ కుమార్




ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 15(విజయం న్యూస్):
ఖమ్మం నగరంలోని 46వ డివిజన్ జూబ్లీపురలో గోళ్ళపాడు ఛానల్ పై రూ. 50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మొహమ్మద్ రజబ్ అలీ పార్క్, రూ.1.86 కోట్లతో ఏర్పాటు చేసిన వీధి వ్యాపారుల సముదాయంను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఖమ్మం నగరంలో సుదీర్ఘకాలంగా మురుగుతో పేరుకుపోయిన గోళ్లపాడ్ ఛానల్ కాలువలో మురుగు నామ రూపాల్లేకుండా చేసి సుమారు రూ. 200 కోట్ల విలువైన స్థలాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ల సహకారంతో కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగించి, కాలువ అంతర్భాగంలో మురుగు, వర్షపు నీరు పారడానికి పైపులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నో సంవత్సరాల నుంచి 10.6 కిలోమీటర్లు పొడవునా ఉన్న కాలువ ఆక్రమణలు, సిల్ట్‌తో వివరాలు 2లో..





## మానవత్వానికి
# కేరాఫ్ నామా

- మానవత్వం పరిమళించిన వేళ
- చీమలపాడు బాధితులకు అన్నీ తానైన నామ
- క్షతగాత్రులను చూసి చలించి..కన్నీళ్ల పర్యంతమైన నామ
- ప్రాణాలు కాపాడాలనే తపన వివరాలు 2లో..
- దగ్గరుండి వైద్య సేవలు
- సందీప్‌ను కాపాడేందుకు మరింత తాపత్రయం

ఖమ్మం, ఏప్రిల్ 15(విజయం న్యూస్):
ఏదైనా జరిగితే నాకెందుకులే ..ఎవరెక్కడ పోతే మనకెందుకనుకుని తప్పించుకు పోయే వారున్న ఈ రోజుల్లో... పేదలకు కష్టం వచ్చిందంటే చాలు క్షణాల్లో వాలిపోతారు..అన్ని తానైతారు.. అక్కున చేర్చుకుంటారు.. అన్ని తానై ఆదరిస్తారు.. అవసరమైన చోట అర్థిక చేయూతనందిస్తారు.. ఆయనేవ్వరో కాదు.. ఖమ్మం ఎంపీ, పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ నేత నామా నాగేశ్వరరావు. ఆయన ఇటీవలే జరిగిన చీమలపాడు ఘటన పట్ల ఆయన చలించిపోయాడు.. బాధితులకు చూపించిన ప్రేమ అద్భుతం.. ఆయన క్షతగాత్రులను కాపాడేందుకు పడిన తపన అంతా ఇంతా కాదు.. కుటుంబం పక్కన ఉన్న, లేకపోయిన ఆయన మాత్రం కుటుంబ సభ్యుడైయ్యాడు.. బాధితులకు పెద్దన్నగా మారాడు.. ప్రతి ఒక్కర్ని కలిశాడు. ఓదార్చాడు.. హక్కున చేర్చుకున్నాడు.. ఆసుపత్రికి పంపించాడు.. బాధితులకు నివాసాలను ఏర్పాటు చేశాడు.. చనిపోయిన వారి నుంచి క్షతగాత్రుల కుటుంబాలను దగ్గర తీసుకున్నాడు. ఓదార్చాడు.. రియల్ పొలిటిషియన్ కాకుండా, రియల్ మ్యాన్ గా మారిపోయారు. ఆయన తపన, ఆరాటం చూస్తుంటే జర్నలిస్టు గా నేను నిజంగా అశ్చర్యపోయాను.. ఆయనలో రాజకీయ నాయకుడ్ని చూడలేదు.. పేదల పక్షపాతిగా చూశాను.. పేదల ప్రేమికుడిగా, పేదల శ్రామికుడిగా చూశాను.. అందుకే ఈ వార్త.. పూర్తి వివరాల్లోకి వెళ్తే

# పొద్దుగూకే టైమొచ్చింది..!

## మా గూటి పక్షులకు స్వాగతం పలుకుతున్నా..!

- ప్రజలందరి దీవెనలతో రామరాజ్యం తీసుకొస్తా
- మళ్లీ చెబుతున్నా ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యేని కూడా అసెంబ్లీ గేటు తాకనివ్వను
- చింతకాని, ముదిగొండ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవ సభల్లో మాజీ ఎంపీ పొంగులేటి

(చింతకాని/ముదిగొండ-విజయం న్యూస్):
పొద్దుగూకే టైమొచ్చింది...మా గూటి పక్షులకు స్వాగతం పలుకుతున్నా.... నేడో రేపో వారందరూ మా గూటికి చేరడం ఖాయమని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. వివరాలు 2లో..





## సీనియర్ పువ్వాడను పరామర్శించిన
# మంత్రి హరీష్ రావు..

(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)
గత రెండు వారాలుగా అస్వస్థతకు గురై హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఐ జాతీయ నాయకులు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తండ్రి పువ్వాడ నాగేశ్వర రావుని శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా పువ్వాడ నాగేశ్వరరావు అరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న చికిత్స వివరాలను మంత్రి హరీష్ కి వైద్యులు వివరించారు. త్వరగా కోలుకుని మంచి ఆరోగ్యంతో తిరిగి మా మధ్యకు రావాలని ఆకాంక్షిచారు.

# చీమలపాడు బాధితులకు 50లక్షలు ఎక్స్ గ్రెసియా చెల్లించాలి

**బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం వల్లనే నలుగురు దుర్మరణం**

**ప్రాణనష్టానికి కారకులైన ఎమ్మెల్యే, ఎంపీలపై కేసు నమోదు చేయాలి**

**విలేకరుల సమావేశంలో జనసేనపార్టీ ఖమ్మం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ డిమాండ్ చేశారు**



ఖమ్మం, ఏప్రిల్ 15 (విజయం న్యూస్):
బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అతి ఉత్సాహంతో ఎటువంటి నియమ నిబంధనలు, జాగ్రత్తలు పాటించకుండా, అనుమతులు తీసుకోకుండా బాణాసంచ పేల్చి నలుగురు దుర్మరణం చెందడానికి కారకులైన ప్రజాప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యే, సంబంధిత నాయకులపై తక్షణమే కేసులు నమోదుచేసి బాధిత కుటుంబాలకు, క్షతగాత్రులకు పేపర్ ప్రకటనలతో కాలయాపన కాకుండా తక్షణమే మరణించిన కుటుంబాల వారికి 50 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా, మూడు ఎకరాల భూమి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఏర్పాటుచేసి, క్షతగాత్రులకు మంచి వైద్యం అందించాలని జనసేన పార్టీ ఖమ్మం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ మిర్యాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ ఖమ్మం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం పేరుతో తమబలం ఎక్కువని నిరూపించుకునేందుకు మద్యం, డబ్బు ప్రలోభాలతో మందిని తరలించి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, జాగ్రత్తలు పాటించకుండా అతి ఉత్సాహంతో బాణాసంచ పేల్చి ప్రాణ నష్టానికి కారుకులయ్యారని ఆరోపించారు. ప్రమాదం జరిగిన రోజునే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం రాష్ట్ర, జిల్లా నాయకత్వం బాధితులను పరామర్శించి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని పవన్ కళ్యాణ్ తో వీడియో కాల్ లో మాట్లాడించి భరోసా కల్పించారన్నారు. క్షతగాత్రులకు బాధిత కుటుంబాల వారికి న్యాయ జరిగేంతవరకు న్యాయపోరాటం చేసైనా వారికి అండగా ఉంటామన్నారు. ఈ కార్య క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు మిరియాల జగన్మోహన్, దేగల రామచం ద్రరావు, మేడబోయిన కార్తీక్, యాసంనేని అజయ్ కృష్ణ, కట్టా రామకృష్ణ, పుల్లారావు, తాళ్లూరి డేవిడ్, ఖమ్మం నగర నాయకులు విజయకుమారి, దేవేందర్, స్రవంత్, శ్రీకాం త్, హరి, రాకేష్, ఉపేందర్, వరప్రసాద్, నాగుల్ మీరా, సతీష్, నరసింహారావు, ఆథిక్, బాలకృష్ణ, నవీన్, నాగరాజు, మనోజ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులపై అవగాహన కల్గి ఉండాలి

**భారత రాజ్యాంగం అనే అంశంపై సెమినార్‌లో ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాస్ రావు**

**ఖమ్మం, ఏప్రిల్ 15(విజయం న్యూస్):**
నగరంలోని మానేరు లా కాలేజీలో శనివారం న్యాయ సేవాధికార సంస్థ, ఖమ్మం, మానేరు లా కాలేజ్ సంయుక్తంగా ' భారత రాజ్యాంగం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. టి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, భారత రాజ్యాంగం దేశానికి సర్వోత్కృష్ట చట్టంమని, భారత రాజ్యాంగం ద్వారా భారతదేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ నిర్మాణం ఎలా ఉండాలి, పరిపాలన ఎలా జరగాలి అనే విషయాలను రాజ్యాంగం నిర్దేశించిందని, శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల అధికారాలు, బాధ్యతలు, వాటి మధ్య సమన్వయం ఎలా ఉండాలో రాజ్యాంగం ద్వారా తెలుస్తుందన్నారు. రాజ్యాంగంలో పీఠిక గుండె వంటిదని, రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక హక్కులు ప్రాథమిక విధుల గురించి ప్రతి ఒక్క పౌరుడు అవగాహన కలిగి ఉండాలని, రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం అందరికీ అందేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేయకుండా అనునిత్యం నేర్చుకుంటూనే ఉండాలన్నారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా మన నుండే మార్పు మొదలవాలన్నారు. సమాజాన్ని భ్రూణ హత్యలు,వరకట్నం లాంటి సాంఘీక దురాచారాలు పట్టి పీడిస్తున్నాయని వీటిని రూపుమాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సేవ దయాగుణం కలిగి ఉండి సమాజానికి ఉపయోగపడాలన్నారు. విద్యార్థిని విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని వాటిని సాధించడానికి ఎంతగానో కృషి చేయాలన్నారు. కష్టపడడంతోనే ఫలితం సాధ్యమవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు న్యాయవిద్యను అందుబాటులోకి తీసుకువచ్చిన యజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవ కార్యదర్శి మహమ్మద్ జావిద్ పాషా, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దిరిశాల కృష్ణారావు, కళాశాల చైర్మన్ యూనస్ సుల్తాన్, న్యాయవాదులు స్వామి రమేష్, పాపారావు, ఇమ్మడి లక్ష్మీనారాయణ, సింగం జనార్ధన్, మోహన్ రావు, రత్నాంబ, జయప్రకాష్ పెద్ద సంఖ్యలో న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.






# ఘనంగా డాక్టర్ కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

**తల్లాడ ఏప్రిల్ 15 (విజయం న్యూస్)**
ఖమ్మం జిల్లా సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షులు రెంటాల నారాయణ ఆదేశాల మేరకు సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాద కృష్ణరెడ్డి 49 వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సమాచార హక్కు వికాస సమితి సత్తుపల్లి నియోజకవర్గం అధ్యక్షులు కందుల నారాయణ అధ్యక్షతన శనివారం అన్నారుగూడెం -నిమ్మగూడెం స్కూల్ నందు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమాచార హక్కు వికాస సమితి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు పణితి రమేష్ బాబు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం -2005 పై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పిస్తూ,ప్రజలను చైతన్యం చేస్తూ, నిరంతరం ప్రజలు కోసమే ఆలోసించే వ్యక్తి డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా జరపడం చాలా సంతోషంగా ఉంది అని తెలిపారు.ఖమ్మం జిల్లా సమాచార హక్కు వికాస సమితి జిల్లా కమిటీ తరుపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అతిధులు సమక్షంలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసారు. విద్యార్థులకి ఫ్రూట్స్, చాకొలేట్స్, స్వీట్స్ పంపిణీ చేశారు.



# అల్లాహ్ అందరినీ చల్లగా చూస్తారు.. మంత్రి పువ్వాడ..

**(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని 23వ డివిజన్ ముస్తఫా నగర్ మజీద్ నందు 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఉపవాసం ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు ఖజ్జూరాలు, పండ్లు తినిపించి ఈరోజు దీక్షను విరమింపజేశారు. అనంతరం వారితో పాటు మంత్రి పువ్వాడ నమాజును ఆచరించి, దువా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మం ప్రజలంతా సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని తాను ఎప్పుడూ కోరుకుంటాను అన్నారు. భక్తి శ్రద్ధలతో రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాసం చేస్తారని అన్నారు. ఖమ్మం ప్రజల బాగు కోసమే తాను ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉన్నానని, ఉంటానని పేర్కొన్నారు.. ఈపవిత్ర రంజాన్ మాసంలో.. ఖమ్మం ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో వుండాలని అల్లాహ్ ను వేడుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్తఫా నగర్ మస్జీద్ కమిటీ సదర్ సాహెబ్ అబ్దుల్ రహమాన్, కమిటీ సభ్యులు ఇబ్రహీం, ఇషాక్, ఇస్మాయిల్, సలీం, సత్తార్, మహమ్మద్ ఆలీ, టిఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్, ఆశ్రీఫ్, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, పగడాల నాగరాజు, ఇలియాజ్, సోహెల్, తాజుద్దీన్, జీవీఎల్ నర్సింహారావు, జునైద్, ముజ్జు, అజీజ్, శేఖర్, అజ్జు, జర్నలిస్ట్ జాని తదితరులు ఉన్నారు.



# పంచాయతీ కార్యదర్శుల సమ్మె నోటీస్

**సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తాం**

**పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు**

(కూసుమంచి-విజయం న్యూస్)

పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే కచ్చితంగా సమ్మెకు వెళ్తామని పంచాయతీ కార్యదర్శుల సంఘం బాధ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం కూసుమంచి మండలానికి చెందిన 41 పంచాయతీ కార్యదర్శులందరు సమ్మె నోటీసులను మండల పరిషత్ అభివద్ధి అధికారి కరుణాకర్ రెడ్డి, తహసీల్దార్ మీరా లకు సమ్మెనోటీసును అందజేశారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీలకు కీలకంగా ఉన్నారు. అయితే వీరి ప్రభుత్వం విధుల్లోకి తీసుకుని ఐదేళ్లు కావస్తున్నప్పటికి ఇప్పటి వరకు వారి సమస్యలను పరిష్కరించడం లేదని కార్యదర్శులరాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మండలాధికారులకు సమ్మెనోటీసులను అందజేశారు. గ్రామ పంచాయతీల్లో రోజురోజుకు పని ఒత్తిడి మరింత అధికమైందని, సుమారు 12గంటల ఉద్యోగం చేయాల్సి వస్తుందని అన్నారు. ప్రజల కోసం పనిచేసేందుకు మాకేలాంటి ఇబ్బంది లేదని, కానీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించకుండా మాతో వెట్టి చాకరి చేయించుకుంటున్నారని ఆరోపించారు.



# ఇల్లెందులో ఇఫ్తార్ విందు

**పాల్గొన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,జెడ్పీ చైర్మన్ కోరం**

(ఇల్లెందు-విజయం న్యూస్)

రంజాన్ పర్వదినం ను పురస్కరించుకొని శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా డైనమిక్ లీడర్ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఇల్లందు సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ ఆవరణంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు పట్టణముతో పాటు మండలంలోని నలుమూలల నుంచి ముస్లిం సోదరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన నమాజ్ కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తోపాటు కనకయ్య భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు .అనంతరం వారు ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పొంగులేటి, కోరం వర్గీయులు నాయకులు మండల రాము మడుగు సాంబమూర్తి జిల్లా శ్రీనివాస్ సూర్యం రమేష్ గౌడ్ పెద్దినేని హరినాథ్ బాబు తదితరులు ఏర్పాటు చేశారు.

# ప్రజా చైతన్యమే లక్ష్యంగా సిపిఐ కార్యాచరణ

**పోడు భూములకు తక్షణమే పట్టాలివ్వాలి**

**ప్రజాపోరు యాత్రలో కూనంనేని**

(ఖమ్మం/ కారేపల్లి-విజయం న్యూస్)

అమ్మకాల మోడీని అధికారం నుంచి సాగనంపాలని లేకుంటే దేశ భవిష్యత్తే ప్రశ్నార్ధకమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారని ఆయన ఆరోపించారు. శనివారం ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర ఏన్కూరు, కారేపల్లి, కామేపల్లి మండలాల్లో జరిగింది. ఈ సందర్భంగా కారేపల్లి మండలం చీమలపాడులో యాత్రకు ఘన స్వాగతం లభించింది. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం దివంగత సిపిఐ నాయకులు బాగం నారాయణ స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ మోడీ నియంతగా వ్యవహరిస్తున్నారని ఆయన గోముఖ వ్యాఘ్రమని సాంబశివరావు తెలిపారు. సాధువుగా తిరుగుతూనే రాక్షస కార్యక్రమాలకు తెరలేపారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధి రంగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారని భవిష్యత్తులో ప్రభుత్వ రంగంలో ఉద్యోగ, ఉపాధి రంగాలు ఉండే అవకాశమే లేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మోడీ పాలనలో చిన్నాభిన్నమైందని సాంబశివరావు తెలిపారు. ఆర్థిక అంతరాలు పెరిగి సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారని, పెరుగుతున్న ఆర్థిక అంతరాలు భవిష్యత్తులో వర్గ పోరాటాలకు దారి తీస్తాయని ఆయన తెలిపారు. ఇక మతపరమైన విషయాలను రాజకీయాల్లోకి తీసుకు వచ్చి లబ్ధి పొందెందుకు ప్రయత్నిస్తుందన్నారు.



బిజెపిని గద్దె దించడమే లక్ష్యంగా వామపక్ష ప్రజా తంత్ర లౌకిక శక్తుల ఐక్యతకు సిపిఐ కృషి చేస్తుందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అంగీకరించేందుకు ససేమిరా అన్న ఆర్ఎస్ఎస్ జన సంఘ్ మూలాలు కలిగిన బిజెపి ఇప్పుడు రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ ఏనాడు జాతీయ జెండాను గౌరవించ లేదని బిజెపి గతంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నం చేసిందని అప్పుడు మెజారిటీ లేకపోవడంతో ఉపసంహరించుకుందని రెండ దఫా గెలిచిన తర్వాత ఇప్పుడు రాజ్యాంగ వ్యవస్థకు తూట్లు పొడుస్తుందని సాంబశివరావు ఆరోపించారు. దేశంలోని బిజెపి పాలన వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాతే కమ్యూనిస్టు పార్టీ బిజెపి హరావో దేశికో బచావో అనే నినాదంతో ప్రజలను చైతన్యపరిచేందుకు పూనుకుందన్నారు. ప్రజలను కార్యోన్ముఖులను చేసేందుకు ఏప్రిల్ 14 నుంచి నెల రోజుల పాటు దేశ వ్యాప్తంగా ఈ యాత్రను చేపడుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం సైతం పోడు భూములు, రుణమాఫీ తదితర విషయాలలో నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందని ప్రభుత్వ లెక్కల ప్రకారమే సుమారు నాలుగు లక్షల మంది పోడు రైతులకు చెందిన 11.50 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. రుణమాఫీని ఏకకాలంలో అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధి రంగాలపై దృష్టి సారించడంతో పాటు లీకులకు సంబంధించి పూర్తి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ నాయకులు మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్రెడ్డి, యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, ఏపూరి అతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్ పాల్గొన్నారు.

# చీమలపాడు ఘటన దురదృష్టకరం

**మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు ఇవ్వాలి**

**కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి**

**చీమలపాడు ఘటనలో మృతుల కుటుంబాలకు కూనంనేని పరామర్శ**



(ఖమ్మం-విజయం న్యూస్):

బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా జరిగిన దురదృష్టకర ఘటనలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. శనివారం కారేపల్లి మండలం చీమలపాడు ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. ప్రతి కుటుంబానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అత్యంత దురదృష్టకరమైన సంఘటన అని నలుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమైన విషయమన్నారు. ప్రభుత్వం ఈ ఘటనకు సంబంధించి అలసత్వానికి తావులేకుండా వ్యవహరించాలన్నారు. కుటుంబాల స్థితిగతులను చూస్తుంటే అంతా పేద, గిరిజన కుటుంబాలకు చెందిన వారేనని సాంబశివరావు తెలిపారు. ఘటన తీరు హృదయవిదారకంగా ఉందన్నారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి సిపిఐ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కారేపల్లి మండల కార్యదర్శి బోళ్ల రామస్వామి, నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# మంచిర్యాల సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

**జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, మహమ్మద్ జావేద్**

(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

మంచిర్యాల సత్యాగ్రహ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా అశేష జనవాహినితో నిండి పోయిందని తెలిపారు. యావత్ దేశం అంతా కాంగ్రెస్ వైపే చూస్తుందనడనికి మంచిర్యాల సభే నిదర్శనం అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన కుటుంబంపై నేడు మోడీ ప్రభుత్వం దాడులకు పాల్పడుతూ.. ప్రజాస్వామ్యన్ని అపహాస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో లీకేజీలతో, దేశంలో లోక్కర్ స్కాం తో ప్రజలను తప్పు దోవ పట్టిస్తూ సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అధికారంలోకి రాగానే తక్షణమే పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయడం జరిగుతుందని, రెండు లక్షల రూపాయల వరకూ రైతు రుణ మాఫీ చేస్తామని, సొంత ఇల్లు కట్టుకోవడానికి 5లక్షల రూపాయల వరకూ ప్రభుత్వం అందజేస్తుందని కాంగ్రెస్ అధిష్టానం తెలిపినట్టు పేర్కొన్నారు.